సాక్షి ఆదిలాబాద్

శనివారం । 24 । ఆగస్టు । 2024



గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఉన్న ఊరిలో ఉపాధి కరువై గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడే తనువు చాలిస్తున్న ఉమ్మడి జిల్లా వాసులు పెరుగుతున్నారు. కుటుంబాలకు తీరని దుఃఖం మిగులుస్తున్నారు. 8లో▸

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆదిలాబాద్: ఆదిలాబాద్–నాందేడ్ మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి–ఆదిలాబాద్ మధ్య కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తున్న దృష్ట్యా ఈ సర్వీసును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అంధత్వ నివారణ పక్షోత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు అంధత్వ నివారణ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా అంధత్వ నివారణ అధికారి రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నేత్రదానం ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మరణాంతరం నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. ఆసక్తిగలవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. దాత మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలను సేకరించనున్నట్లు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా నేత్రదానం చేయవచ్చని పేర్కొన్నారు. నేత్రదానంచేయాలనుకునే వారు 9000484201, 9866516995, 9247750829, 9963478753 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఎస్‌వోగా వాజీద్‌అలీ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వాజీద్‌అలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాలశాఖ అధికారిగా ఎండీ వాజీద్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న ఆయనను జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఇన్‌చార్జి డీఎస్‌వోగా పూర్తి బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.


విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జ్వరంతో బాధపడుతున్న బాలుడిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని వికలాంగుల కాలనీలో శుక్రవారం పర్యటించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులకు అవగాహన కల్పించారు. టైర్లు, కూలర్లు, కొబ్బరిబోండాల్లో ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షపు నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది జ్వరం, తదితర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 79 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మళ్లీ ఇన్‌చార్జేనా..?

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాకపై సందిగ్ధం
- పుల్లయ్య రిలీవ్.. బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామికి ఇన్‌చార్జి బాధ్యతలు
- వరంగల్ నుంచి బదిలీపై ఇక్కడికి రావాల్సిన ఉష అనాసక్తి..?
- మరోవైపు జిల్లాలో పలు కీలక పోస్టులు ఖాళీ



జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం



శ్రీధర్‌స్వామి, ఇన్‌చార్జి డీఏవో, ఆదిలాబాద్

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా వ్యవసాయశాఖ అధికారి పోస్టులో మళ్లీ ఇన్‌చార్జే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ఈ శాఖలో జరిగిన బదిలీల్లో వరంగల్ డీఏవోగా కొనసాగుతున్న డి.ఉషను ఆదిలాబాద్‌కు బదిలీ చేస్తూ, ఇక్కడ ఇన్‌చార్జి డీఏవోగా వ్యవహరిస్తున్న ఏడీఏ పుల్లయ్యను ఖమ్మంకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో కొత్త అధికారిణి డి.ఉష వచ్చేంత వరకు బోథ్ ఏడీఏ శ్రీధర్‌స్వామిని ఇన్‌చార్జి గా నియమిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు జారీ చేశారు. కాగా ఉష ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదనే ప్రచారం వ్యవసాయ శాఖలో ఉంది. తిరిగి అక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె వస్తుందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తిరిగి ఇన్‌చార్జి పాలననే కొనసాగే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

కీలక పరిస్థితుల్లో..

వ్యవసాయ శాఖలో జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి జిల్లా పరంగా జేడీఏ ఆదిలాబాద్ కేంద్రంగా ఉన్నతాధికారిగా కొనసాగేవారు. కాగా జిల్లాల విభజన తర్వాత జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) పోస్టును అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌లోని పోస్టులో రెగ్యులర్ అధికారిని నియమించాలంటే జేడీఏ హోదా ఉన్నవారినే కేటాయించాలి. ఇదిలా ఉంటే ఇక్కడ డీఏవోగా వ్యవహరించినటువంటి జేడీఏ ఆశకుమారి ఆదిలాబాద్‌లోనే పోస్టింగ్‌లో ఉన్నప్పటికీ హైదరాబాద్ కమిషనరేట్‌లో డిప్యూటేషన్‌పై కొనసాగుతూ వచ్చారు. మొన్నటి బదిలీల్లో ఆశకుమారిని ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ స్థానంలో జేడీఏ డి.ఉషను ఆదిలాబాద్ డీఏవోగా నియమించారు. అయితే ఆమె ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదనే ప్రచారం సాగుతుంది. దీంతో మళ్లీ ఏడీఏ స్థాయి అధికారే ఇన్‌చార్జిగా కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో మూడు విడతల్లో రుణమాఫీ జరిగిన తర్వాత ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాలోనే రైతులు తమకు రుణమాఫీ కాలేదని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిన విషయం విదితమే. దీంతో ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల వారీగా వ్యవసాయ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈనెల 30 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ప్రధానంగా సాంకేతిక సమస్యలతో అనేక మంది రైతులకు జిల్లాలో రుణమాఫీ జరగలేదని అంటున్నారు. అంతే కాకుండా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తప్పిదాల కారణంగా ఆ బ్యాంకు ఖాతాలు ఉన్నటువంటి అనేక మంది రైతులు అసలు రుణం కంటే తక్కువ రుణం మాఫీ అయింది. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రస్తుతం వ్యవసాయ శాఖపై ఉంది. ఇలాంటి కీలక తరుణంలో రెగ్యులర్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటం వెలతిగా కనిపిస్తుంది.

ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా..

వ్యవసాయ శాఖలో డీఏవో పోస్టు తర్వాత జిల్లాకు సంబంధించి ఆరు ఏడీఏ పోస్టులు ఉన్నాయి. మొన్నటి బదిలీల్లో ముగ్గురు ఏడీఏలకు ఇక్కడినుంచి స్థానచలనం కలిగింది. ఆ స్థానాల్లో ఇతర ఏడీఏలెవరిని నియమించలేదు. రైతు శిక్షణ కేంద్రం (ఎఫ్‌టీసీ), మట్టి నమూనాల పరీక్ష ల్యాబ్ (ఎస్టీఎల్)తో పాటు జిల్లా కార్యాలయంలోనే ఏడీఏ (టెక్నికల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఆదిలాబాద్ ఏడీఏగా కొనసాగిన పుల్లయ్య ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోవడంతో అది కూడా ఖాళీ అయ్యింది. బోథ్ ఏడీఏగా కొనసాగుతున్న శ్రీధర్‌స్వామికి ఇన్‌చార్జి డీఏఓగా బాధ్యతలు అప్పగించడంతో ఇక ఆ పోస్టులో కూడా అధికారి ఉండి లేనట్టే. ఇక ఇచ్చోడ ఏడీఏగా రాంకిషన్ కొనసాగుతున్నారు. దీంతో వ్యవసాయ శాఖలో జిల్లా అధికారి తర్వాత కీలకమైనటువంటి అనేక ఏడీఏ పోస్టులు ఖాళీగా ఉండడంతో రైతులకు సేవలు అందించడంలో వెనుకబడే పరిస్థితి కనిపిస్తుంది. అంతే కాకుండా మండల స్థాయిలో కీలకమైనటువంటి ఏవో పోస్టులు కూడా బేల, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, నార్నూర్ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో రుణమాఫీకి సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తుండగా ఇలాంటి పరిస్థితి ఉండడంతో వాటిని పరిష్కరించడంలో ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది.

'స్వయం ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా

సిరికొండ: యువత స్వయం ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని రిమ్మ గ్రామంలో పీఎంఎఫ్ఎంఈ రుణాలతో ఏర్పాటు చేసిన ఆయిల్ మిల్, ఫ్లోర్‌మిల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా యువత ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయన్న, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.



ఆయిల్ మిల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కుక్కలకు కు.ని ఆపరేషన్లు షురూ


- తొలిరోజు 20 శునకాలకు సర్జరీ



సర్జరీ చేస్తున్న పశువైద్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో వీధి కుక్కల బెడద నియంత్రించే దిశగా బల్దియా చర్యలు చేపట్టింది. పట్టణ పరిధిలోని బంగారుగూడ డంపింగ్ యార్డులో గల యానిమల్ బర్త్ కేర్ సెంటర్‌లో శుక్రవారం కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.కిషన్ ఆధ్వర్యంలో పశువైద్యులు దూద్‌రాం రాథోడ్, సురేశ్, వినోద్‌లు సర్జరీలు చేశారు. ముందగానే పట్టి ఉంచిన కుక్కలకు ఆపరేషన్లు చేసి వాటిని ప్రత్యేక కేజ్‌ల్లో ఉంచారు. తొలి రోజున 20 కుక్కలకు ఆపరేషన్లు చేశారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో సర్వే చేయగా పట్టణంలో వెయ్యి కుక్కలు ఉన్నట్లుగా తేలిందన్నారు. వాటితో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందు గాను తగు చర్యలు చేపట్టామన్నారు. కుక్కల సంతాన ఉత్పత్తిని కట్టడి చేసేలా సర్జరీలు చేస్తున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఐదు రోజుల పాటు ప్రత్యేక కేజ్‌ల్లో ఉంచుతామన్నారు. వాటికి అవసరమైన తాగునీరు, ఆహారంతో పాటు యాంటీ రేబీస్ టీకాలు సైతం అందిస్తున్నట్లు తెలిపారు. సర్జరీ అనంతరం తిరిగి కాలనీల్లో వదిలిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది తదితరులున్నారు.

మెడికోలకు భద్రత కల్పించాలి



రక్తదానం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో వైద్య విద్యార్థులకు పటిష్ఠ భద్రత కల్పించాలని జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని దారుణహత్య నేపథ్యంలో చేపడుతున్న నిరసనలు 11వ రోజుకు చేరాయి. ఇందులోభాగంగా శుక్రవారం రిమ్స్ ఆడిటోరియంలో జూడాలు రక్తదానం చేసి నిరసన తెలిపారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, ప్రధాన కార్యదర్శి కారుణ్య, ఉపాధ్యక్షుడు స్మజ్, అన్వేష్, మౌనిక, అక్షయ్, సూరజ్, రుచిక, చందన, అభినయ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై డీఈవోకు ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాల బాలక్‌మందిర్ ప్రధానోపాధ్యాయురాలిపై విద్యార్థిని తండ్రి సమీఉల్లా ఖాన్ డీఈవోకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన కుమార్తె జైనబ్‌ను పాఠశాల నుంచి తొలగించేందుకు టీసీ సిద్ధం చేసినట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 14న పాఠశాలలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆడుకునే సమయంలో జరిగిన ఘటనను రాద్ధాంతంగా మార్చి తన కూతురిని పాఠశాల నుంచి పంపించేలా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. తాను వెళ్లి ప్రధానోపాధ్యాయురాలిని బతిమిలాడినప్పటికీ అసభ్య పదజాలంతో దూషించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై 'సాక్షి' ప్రధానోపాధ్యాయురాలు హజార్‌బానును వివరణ కోరగా, పదో తరగతి చదివే విద్యార్థిని జైనబ్ క్రమశిక్షణ పాటించడం లేదని, ఓ విద్యార్థిని రాయితో కొట్టడంతో గాయమైనట్లు తెలిపారు. ఆమె ప్రవర్తన సరిగా లేకపోవడంతో టీసీ జారీ చేసేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్.. కొరడా



రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాక్ చేసిన ట్రాఫిక్ పోలీసులు



- రాంగ్ పార్కింగ్ చేస్తే వీల్ లాక్!
- రోడ్లపై ఇష్టానుసారం వాహనాలు నిలిపితే కఠిన చర్యలు
- రంగంలోకి ట్రాఫిక్ పోలీసులు
- వాహనదారులూ.. తస్మాత్ జాగ్రత్త

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో రహదారులపై ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానా వసూలు చేస్తున్నారు. లేదంటే వాహనం అక్కడినుంచి కదలకుండా వీల్ లాక్ చేస్తున్నారు. జరిమానా చెల్లించేంత వరకు ఆ లాక్ తొలగించట్లేదు. అంతే కాదు.. జరిమానాతో పాటు పాత చలాన్లు సైతం వసూలు చేస్తున్నారు. వాహనదారులూ.. తస్మాత్ జాగ్రత్త. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జరిమానా బారిన పడకుండా అప్రమత్తంగా ఉండండి.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

జిల్లా కేంద్రంలో వాహనాల సంఖ్య పెరగడంతో రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. కొంతమంది తమ వాహనాలను రహదారులపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వివిధ పనుల నిమిత్తం నిత్యం జిల్లా కేంద్రానికి వచ్చే వారు, ఆయా దుకాణాలకు వెళ్లే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో అత్యవసర సమయంలో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ముఖ్యంగా అశోక్‌రోడ్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్, రైతుబజార్, కలెక్టర్ చౌక్, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది.

రోడ్డెక్కుతున్న వ్యాపారాలు..

కొంతమంది వ్యాపారులు ప్రధాన రోడ్లను అక్రమించి వ్యాపారం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డు మధ్యలో నిలపాల్సి వస్తుంది. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని కాన్వెంట్ పాఠశాల, బస్టాండ్ ప్రాంతంలో ఉన్న స్కూళ్ల ఎదుట, వినాయక్ చౌక్‌లోని పాఠశాలల వద్ద నిత్యం ఈ సమస్య తలెత్తుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అంబేద్కర్ చౌక్ నుంచి గాంధీచౌక్, అశోక్ రోడ్ నుంచి బంగారు దుకాణాలకు వెళ్లే తిర్పెల్లి రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో రెండు వాహనాలు దాటలేని పరిస్థితి కనిపిస్తుంది. దుకాణాల ముందే వాహనదారులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా పట్టణంలోని కలెక్టర్ చౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీ చౌక్, మున్సిపల్, తాంసి బస్టాండ్, సాత్నాల బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహన వీల్ లాక్..

ఈ క్రమంలో సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని ఎక్కడపడితే పార్కింగ్ చేస్తే ఆ వెహికిల్ వీల్ లాక్ చేస్తున్నారు. జరిమానా చెల్లించే దాకా తొలగించట్లేదు. అంతేకాకుండా ఆ వాహనంపై ఉన్న పాత చలాన్లూ వసూలు చేస్తున్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే వీల్ లాక్..



పట్టణంలో కొంత మంది వాహనదారులు ఇష్టారీతిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. నిబంధనలు ఉల్లంఘించి రాంగ్ పార్కింగ్ చేస్తే ఆ వాహన వీల్ లాక్ చేస్తున్నాం. రూ.వెయ్యి జరిమానాతో పాటు పాత చలాన్లు చెల్లించేంత వరకు ఆ వాహనం అక్కడి నుంచి కదలకుండా చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా శుక్రవారం మూడు వాహనాలకు వీల్ లాక్ చేశాం. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రణయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ, ఆదిలాబాద్

ఎల్‌ఆర్‌ఎస్.. స్లో!



ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ల పరిశీలనను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

- నెమ్మదిగా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ
- అందుబాటులో లేని దరఖాస్తుదారుల సెల్‌నంబర్లు
- వివరాల నమోదుకూ సాంకేతిక తిప్పలు
- స్పందిస్తేనే.. సత్వర పరిష్కారం

కైలాస్‌నగర్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ జిల్లాలో మొదలైంది. దరఖాస్తుల పరిశీలనకు ఎంపిక చేసిన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో కార్యాచరణను ప్రారంభించాయి. అయితే దరఖాస్తు చేసిన సమయంలో ప్లాట్ల యజమానులు ఇచ్చిన సెల్‌నంబర్లు పనిచేయకపోవడం, కొన్ని దరఖాస్తుల్లో అసలు సెల్‌నంబర్లే లేకపోవడంతో అలాంటి ప్లాట్లను గుర్తించడం అధికారులకు కష్టతరంగా మారింది. పరిశీలనకు వచ్చే సమయాన్ని ముందుగా దరఖాస్తుదారులకు తెలిపే అవకాశం కూడా లేకుండాపోతోంది. దీనికి తోడు ప్లాట్ల వివరాలు నమోదు చేయాల్సిన యాప్ సర్వర్ సైతం డౌన్ అవుతుండటంతో సాంకేతికంగానూ ఇబ్బంది తప్పడం లేదు. దరఖాస్తుదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశీలనకు వచ్చే సిబ్బందికి సహకరిస్తే ప్రక్రియ త్వరితగతిన జరిగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆరు ప్రత్యేక బృందాలు

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కోసం రెవెన్యూ, మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ శాఖలకు చెందిన 18 మంది అధికారులను ఎల్1 (మొదటి లెవల్) నియమించారు. వీరిని ఆరు టీంలుగా విభజించారు. ఒక్కో టీంలో ఆయా శాఖలకు సంబంధించిన ఒక్కో అధికారిని నియమించారు. ఆ ముగ్గురు అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తుదారులకు సంబంధించిన ప్లాట్లను పరిశీలిస్తున్నారు. ప్లాట్ ఫొటోతో పాటు దానినంబర్, సర్వే నంబర్, ప్లాట్ హద్దులను పరిశీలించి వాటి పూర్తి వివరాలను ఎల్‌ఆర్‌ఎస్–2020 ప్రత్యేకయాప్‌లో నమోదు (జియో లొకేషన్)చేసి ఎల్–2 అధికారులకు పంపుతున్నారు.

ప్రత్యేక హెల్ప్‌డెస్కులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందు కోసం కలెక్టరేట్‌తో పాటు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ సందేశ్ సెల్‌నంబర్– 97057 12303, మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఖుర్బాన్ సెల్‌నంబర్ 80193 37150 ను ఇన్‌చార్జీలుగా నియమించారు. వీరు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారు. దరఖాస్తుదారులు నేరుగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఇబ్బందులు ఇలా..

ఈ దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా మంది దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేసుకున్న సమయంలో సెల్‌నంబర్లు రాయలేదు. మరి కొన్నింటిలో వారిచ్చిన సెల్ నంబర్లు పనిచేయడం లేదు. 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పలువురు తమ ప్లాట్లను ఇతరులకు అమ్ముకున్నారు. ఇలాంటి వారు ముందుకు రాకపోగా సెల్ నంబర్లు పనిచేయని వారిని సంప్రదించడం అధికారులకు ఇబ్బందికరంగా మారుతోంది. దీనికి తోడు యాప్ సర్వర్ తరచూ డౌన్ అవుతుండటంతో వివరాల నమోదు ప్రక్రియలో ఆలస్యమవుతుంది. మూడు రోజుల్లో కేవలం 25 దరఖాస్తులను మాత్రమే పరిశీలించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020 సంవత్సరంలో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశీలన అధికారులకు సహకరించాలి. పరిశీలనకు వచ్చిన సమయంలో రిజిస్టర్డ్ డాక్యుమెంట్స్, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు రశీదు, లింకు డాక్యుమెంట్స్‌ను తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. ప్లాట్లను విక్రయించిన వారు కూడా ఎల్‌ఆర్‌ఎస్ తమ పేరిట చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు విషయాలను గమనించి ప్రక్రియ విజయవంతానికి సహకరించాలి.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

29న జాతీయ క్రీడా దినోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ఉదయం 7 గంటలకు స్టేడియం నుంచి ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికిపుష్పాంజలితో పాటు మొక్కలు నాటడం, 2023–24 విద్యా సంవత్సరంలో జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 25లోపు స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాసంఘాల ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులుపాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన పుల్కం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లో ఉన్న బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గామ్ గ్రామానికి చెందిన సట్ల నరసయ్య జీవనోపాధికోసం ఏడాది క్రితం దుబాయ్‌కి వలస వెళ్లాడు. వారం రోజులక్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో తాను ఉంటున్న గదికే పరిమితమయ్యాడు. మంగళవారం తోటి కార్మికులు వెళ్లి చూడగా శవమై కనిపించాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన కునారపు వెంకటేశ్ (28) ఉపాధి కోసం గతేడాది ఇరాక్ దేశం వెళ్లాడు. నాలుగు నెలలు అక్కడ పనిచేశాడు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కృంగిపోయాడు. ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెండోళ్ల సుధాకర్ ఆరునెలల క్రితం జిల్లాకు చెందిన ఓ ఏజెంట్‌కు లక్షలు చెల్లించి విజిట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక, చేసిన పనికి వేతనం రాక నరకయాతన అనుభవించాడు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 15న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తెప్పించేందుకు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్ (41) ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడే పనిచేస్తుండగా జూలై 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే నెల 8న మృతి చెందాడు. 19 రోజులకు మృతదేహం స్వగ్రామం చేరుకుంది.

- బతుకుదెరువుకు వెళ్లి మృత్యువాత పడుతున్న కార్మికులు
- నకిలీ ఏజెంట్ల వలలోపడి విలవిల..
- అక్కడ ఉండలేక, ఇక్కడికి రాలేక నరకయాతన
- కుటుంబ సభ్యుల అరణ్యరోదన
- కొనసాగుతున్న వరుస ఘటనలు



దేవునిగూడలో వెంకటేశ్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)



గల్ఫ్ వలసలపై అవగాహన కల్పిస్తున్న గల్ఫ్ సంఘాల నాయకులు (ఫైల్)



దుబాయ్‌లో ఆత్మహత్యచేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గల్ఫ్‌నాయకులకు విన్నవిస్తున్న బాధిత కుటుంబీకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: 'దూరపు కొండలు నునుపు' అనే చందంగా ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్తే ఆర్థికంగా బాగుపడతామని జిల్లా నుండి ఒకరిని చూసి మరొకరు దుబాయ్, కువైట్, బహ్రెయిన్, తదితర దేశాలకు వలసబాట పడుతున్నారు. అలా వెళ్లినవారు అప్పుల బారినపడి అక్కడే తనువు చాలిస్తున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు నెలల తరబడి ఎదురు చూడడం, ప్రభుత్వాలు, కార్మిక సంఘాల నాయకులను వేడుకోవడం వంటి ఉదంతాలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి.

నకిలీ వీసాలతోనే...

విదేశాల్లో ఉద్యోగాల పేరిట నకిలీ ఏజెంట్ల మోసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు పెరిగిపోతుండడంతో ఇటీవల ఏజెంట్ల సంఖ్య కూడా ఎక్కువైపోతోంది. గ్రామీణ ప్రాంతాలవారు గల్ఫ్ దేశాలబాట పట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో వారికి ఎక్కువ జీతాలను ఏరచూపుతూ వల వేస్తున్నారు. దీంతో నకిలీ ఏజెంట్ల బారినపడి అక్కడికి వెళ్లిన కార్మికులు తీవ్ర అవసోపాలు పడుతున్నారు. అక్కడ సరైన వేతనం లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. గత్యంతరం లేక అక్కడే బలవన్మరణాలకు పాల్పడటమో, మనోవేదనతో గుండెపోటుకు గురికావడంతోనో తనువు చాలిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే..

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు స్వగ్రామానికి తిరిగి వస్తామో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి జిల్లా నుండి ఎన్నో ఆశలతో కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, దుబాయ్ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్తున్న కార్మికులు ఏజెంట్ల మోసాలతో వేదన అనుభవిస్తున్న తీరు ఇటీవల విడుదల చేస్తున్న సెల్ఫీ వీడియోలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి సరైన వేతనం అందటం మాట అటుంచి తిరిగి ఇంటికి రావాలన్నా విమాన ప్రయాణ చార్జీలకు వేలాది రూపాయలు వెచ్చించలేక మానసిక ఒత్తిడికి గురై అక్కడే మృత్యువాత పడుతున్న ఉదంతాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి.

విజిట్ వీసాలతో గాలం

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం అనగానే ఎగిరి గంతేస్తూ ఇక్కడి కార్మికులు సరైన నైపుణ్యం లేకుండానే ఫ్లైట్ ఎక్కి విదేశాలకు వెళ్లిపోతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. దీనికి తోడు విజిట్ వీసాపై వెళ్లి అక్కడ నైట్ వాచ్‌మెన్‌గా, కాపలాదారులుగా, ఇతర షాపింగ్‌మాల్స్‌లో లేబర్లుగా, గొర్రెలు, మేకల కాపరులుగా పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కంపెనీ వీసా పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు వసూలు చేసి ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ దేశాలకు వలస బాట పడుతున్న కార్మికులకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ సహకారం అవసరం



గల్ఫ్ దేశాలకు వలసబాట పడుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహకారం అందించాలి. అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల బాట పడుతున్న వారికి ఇక్కడే పలు రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలు కూడా తగ్గుముఖం పడుతాయి. ఇక్కడే ఉపాధి అవకాశాలు పెంచుకునేలా చైతన్యం కల్పించాలి. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మహ్మద్ ఫైజల్ (ఫైల్)

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణానికి చెందిన మహ్మద్ ఫైజల్ (26) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. భైంసాకు చెందిన మహ్మద్ ఫైజల్ గురువారం రాత్రి తన స్నేహితులతో కలిసి టవేరా వాహనంలో భైంసా నుంచి బోధన్‌లో జరిగే సందల్ కార్యక్రమానికి వెళ్తుండగా నవీపేట మండలంలోని అబ్బాపూర్ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో మహ్మద్ ఫైజల్ అక్కడికక్కడే మృతి చెందగా అల్మాస్, రిజ్వాన్, ఉమేర్, యాకుబ్, ఇర్షాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. నవీపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతాంలో జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పుప్పాల భూమయ్య (40)దుర్మరణం చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. జైనథ్ మండలం బాలాపూర్‌కు చెందిన భూమయ్య ఆదిలాబాద్ పట్టణంలో మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బాలాపూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం కనకాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల అరుణ్ పరిమండల్ రోడ్డు వైపు ఉన్న ఫంక్షన్ హాల్ వైపు నుండి బైక్‌పై గ్రామానికి వస్తుండగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన దోష గంగాధర్ కారులో వస్తూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో అరుణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన సాయారెడ్డి (38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం పంటచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సుమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి మోహన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లోకేశ్వరం: మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన రాపని లక్ష్మి(32) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన లక్ష్మి, నర్సింలు దంపతులు బండరాళ్లు కొడుతు జీవనం సాగిస్తున్నారు. గురువారం తన తోటి కూలీలతో కలిసి బండరాళ్లు కొట్టడానికి రాయపూర్‌కాండ్లీ శివారు ప్రాంతంలోకి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగానే నోరు, ముక్కు నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి దేవరంగుల నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి.. ఒకరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని మారుతినగర్‌లో పిడుగు పాటుతో ఎద్దు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. టీకం రామారావుకు చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా మాజీ సర్పంచ్ సిడాం గంగారాంకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ జైవంత్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని గంగారాంను 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన దుర్వే రామ్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం భీంసరి నుంచి వరలక్ష్మినగర్ వైపు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో వాహనాన్ని నిలిపి మూత్రవిసర్జనకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ట్యాంక్ కవర్‌లో మొబైల్ ఫోన్ సైతం ఉన్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు టూటౌన్ విష్ణుప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

28న జాతీయ క్రీడా దినోత్సవం

ఉట్నూర్‌రూరల్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న ఉట్నూర్‌లో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కేబీ కాంప్లెక్స్ ప్రధాన గేటు నుంచి పరుగు ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, ఆదర్శ క్రీడా పాఠశాలలకు చెందిన గిరి విద్యార్థులను సత్కరిస్తామన్నారు.

వైభవంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతం



పాల్గొన్న మహిళలు

- బాసరకు తరలివచ్చిన భక్తజనం

బాసర: నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయానికి శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణంలో మూడో శుక్రవారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో సౌభాగ్యలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేకువజామున మహాలక్ష్మీ, సరస్వతీ, మహాకాళీ అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం, అర్చన, విశేష గణపతిపూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయపట్టింది. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు.



సౌభాగ్యలక్ష్మీ వ్రతపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వైకల్యం కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో రిటైల్, హాస్పిటాలిటీ, బీఎఫ్ఎస్ఐ కోర్సుల్లో 2 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100 శాతం వైకల్యం, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30 సాయంత్రం 6 గంటలలోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010295910 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్‌శాఖలో ఉత్తమ పురస్కారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ పెంచి వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు విద్యుత్ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్' పేరిట ఏప్రిల్ నుంచి ప్రతీనెల బహుమతులు అందజేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంచిర్యాల జిల్లా ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. సప్‌లై మెయింటనెన్స్, డీటీఆర్ నిర్వహణ, వైఫల్యాలను తగ్గించడం, విద్యుత్ అంతరాయం తగ్గించడం, వినియోగదారులందరికీ సత్వర సేవ, కొత్త సర్వీస్ కనెక్షన్ల మంజూరు, మీటర్ల బిగింపు, ఎనర్జీ ఆడిట్, కెపాసిటర్స్‌ని పెంచడం తదితర మెరుగైన చర్యలు తీసుకుంటూ సంస్థ మనగడకు తోడ్పడడం, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేని సరఫరా చేయడం వంటి అంశాలను పరిగణంలోకి తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో బెల్లంపల్లి రూరల్ ఆపరేషన్ ఏఈ, ఉత్తమ అవార్డు, మేలో హాజీపూర్ ఆపరేషన్ ఏఏఈ సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ, ఆపరేషన్ సిబ్బందికి ఉత్తమ అవార్డు, జూన్‌లో లక్సెట్టిపేట ఏఈ ఆపరేషన్ సర్కిల్ పరిధి సిబ్బందికి, ఏడీఈ లక్సెట్టిపేట ఆపరేషన్ విభాగం సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ ఆపరేషన్ విభాగం సిబ్బందికి, జూలైలో ఏఈ ఆపరేషన్ బెల్లంపల్లి రూరల్ సిబ్బందికి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

27న 'నిధి ఆప్కే నిఖత్'పై అవగాహన

కైలాస్‌నగర్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో (నిధి ఆప్‌కే నిఖత్) భవిష్యనిధి మీ వద్దకు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లో డీఆర్డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో డీఆర్డీఏ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో, నిర్మల్ జిల్లాలో గాజులపేట ప్రిన్స్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్-ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం మామడ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు నర్సాపూర్-ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఆటోను, రోడ్డు పక్కన ఉన్న వ్యక్తులను ఢీకొట్టింది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సాపూర్-ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య నర్సాపూర్ గ్రామానికి చెందిన పోషన్న మొక్కజొన్న కంకులు అమ్ముతుండగా కడెం నుండి నిర్మల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు అక్కడ ఆగి కంకులు కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో భైంసా నుండి మామడ వైపునకు దగడే ప్రకాష్ ఆటోలో సామానుతో వెళ్తున్నాడు. ఇదే సమయంలో మామడ నుండి నిర్మల్ వైపు కారులో వచ్చిన సారంగాపూర్ మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన దంసం రాంరెడ్డి ముందుగా మొక్కజొన్న కంకులు అమ్మే పోషన్నను, కంకులు కొనుగోలు చేస్తున్న గోవింద్‌ను ఢీకొట్టిన అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ ప్రకాష్, గోవింద్, పోశన్నకు తీవ్ర గాయాలయ్యాయి, గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించించారు. గోవింద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అజాగ్రత్తగా కారు నడిపి ముగ్గుర్ని గాయపర్చిన రాంరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.





గాయపడిన గోవింద్, పోశన్న



గాయపడిన ఆటో డ్రైవర్ ప్రకాశ్

ఆర్జీయూకేటీలో అవగాహన సదస్సు

బాసర: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ పూర్తి చేసి బీటెక్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థుల కోసం శుక్రవారం అవగాహన సదస్సు ప్రారంభించారు. ఏఐసీటీఈ నిబంధనల మేరకు వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాలతో పదిరోజులపాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల ప్రాముఖ్యత, పరిచయం, వివిధ డిపార్ట్‌మెంట్లలోని సౌకర్యాలు, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ప్లేస్‌మెంట్ గణాంకాలు, బీటెక్ తర్వాత కెరీర్ మార్గదర్శకాల ప్రస్తావన తదితర అంశాల గురించి ప్రొఫెసర్లు, నిపుణులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు రణదీర్ సాగి మాట్లాడుతూ.. సమాజంలో ఉత్తమ ఇంజినీర్ అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 84 మంది పూర్వ విద్యార్థులు ఏఈఈలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరితో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గుర్తు చేశారు. సమన్వయకర్త కిరణ్‌కుమార్ ఆత్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

ఆంగ్లభాషా నైపుణ్యాల మెరుగుకు చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఐటీడీఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆంగ్లభాషా నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా విబా, లీప్ ఫర్ వర్డ్ సంస్థ సహకారంతో ముందుకెళ్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 3వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం రూపొందించడం జరుగుతుందన్నారు. ఎలిమెంటరీ రీడింగ్, అడ్వాన్స్‌డ్ రీడింగ్ స్థాయిలుగా రూపకల్పన చేయబడిందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వసంత్ రావు, సంస్థ సభ్యులు వీరనారాయణ, చైతన్య చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పీవో